సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
బుధవారం | 24 | సెప్టెంబర్ | 2025



కరుడు గట్టిన నేరస్తుడి కోసం ముమ్మర గాలింపు

పోలీసుల కళ్లు కప్పి సోమవారం రాత్రి పారిపోయిన కరుడు గట్టిన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.


8లో



అప్రమత్తతతోనే భద్రత

పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చేశారు. ఈ సమయంలో ఎంతో ఆనందంతో ఆటపాటల్లో మునిగి తేలే చిన్నారుల రక్షణ పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి మంగళవారం 4,30,879 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. తూర్పు డెల్టాకు 4,700, మధ్య డెల్టాకు 1,800, పశ్చిమ డెల్టాకు 6,000 కలిపి మొత్తం 12,500 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యారేజీ వద్ద 9.80, భద్రాచలంలో 29.40 అడుగుల మేర నీటిమట్టాలు నమోదయ్యాయి.

న్యూస్‌రీల్

గాయత్రీదేవిగా మాణిక్యాంబా అమ్మవారు



గాయత్రీదేవిగా అలంకరించిన మాణిక్యాంబా అమ్మవారి ప్రతిమ

రామచంద్రపురం రూరల్: పంచారామ క్షేత్రాల్లో ఒకటిగా, త్రిలింగ క్షేత్రాల్లో ఒకటిగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా విరాజిల్లుతున్న ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో దసరా మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం మాణిక్యాంబా అమ్మవారి మట్టి ప్రతిమకు గాయత్రీదేవిగా అలంకరణ చేశారు. ఆలయ ఈఓ, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గాభవాని ఆధ్వర్యంలో మేలుకొలుపు, ప్రభాత సేవ, సుప్రభాత సేవ, ప్రాతఃకాలార్చన, తీర్థపు బిందె, బాలభోగం, ప్రథమాభిషేకం, ప్రథమార్చనల అనంతరం అమ్మవారి సన్నిధిలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆస్ట్రానమీలో కైవల్యరెడ్డి ప్రతిభ



కుంచాల కైవల్యరెడ్డి

నిడదవోలు: జర్మనీలో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రోఫిజిక్స్ కాంపిటీషన్–2025లో నిడదవోలు పట్టణానికి చెందిన కుంచాల కైవల్యరెడ్డి 16–19 యూత్ కేటగిరీ ఫైనల్ రౌండ్ పూర్తి చేసుకుని, సిల్వర్ ఆనర్ సర్టిఫికెట్ సొంతం చేసుకుంది. అంతర్జాతీయ ఖగోళ శాస్త్రం, ఖగోళ భౌతిక శాస్త్ర సంస్థ నిర్వహించిన ఈ పోటీలో 120 దేశాలకు చెందిన వేలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. మూడు దశల్లో నిర్వహించిన ఈ పోటీలో ఖగోళ, ఖగోళ భౌతిక శాస్త్రానికి సంబంధించిన రియల్ వరల్డ్ రీసెర్చ్ ప్రాబ్లమ్స్‌కు సంబంధించిన ప్రశ్నలుంటాయి. మొదటి రౌండ్ జూలై 4న, రెండో రౌండ్ ప్రీ ఫైనల్ ఆగస్టు 14న, మూడో రౌండ్ ఫైనల్ ఈ నెల 17న నిర్వహించారు. మొదటి రెండు రౌండ్లలో కటాఫ్ మార్కులు సాధించిన కైవల్యరెడ్డి ఫైనల్ రౌండ్‌కు అర్హత సాధించింది. సంస్థ నియమించిన ఇన్విజిలేటర్ ఆధ్వర్యాన ఫైనల్ రౌండ్ పరీక్షను ఈ నెల 17న ఆమె రాసింది. మూడు రౌండ్లలోనూ ప్రతిభ కనబరిచిన కైవల్యరెడ్డి సిల్వర్ ఆనర్ ప్రశంసాపత్రాన్ని అందుకుంది.

రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలు



నిసార్ అహ్మద్

సాక్షి, రాజమహేంద్రవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ నేతృత్వంలో కక్ష పూరిత రాజకీయాలు తారస్థాయికి చేరాయని, అందుకు నిదర్శనమే ఎంపీ మిథున్‌రెడ్డి అక్రమ అరెస్టు అని వైఎస్సార్ సీపీ మదనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ ఆరోపించారు. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్న మిథున్‌రెడ్డితో నిసార్ అహ్మద్, మాజీ ఎమ్మెల్సీ నరేష్‌కుమార్‌రెడ్డి మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడుతూ, లేని మద్యం స్కాం పేరుతో ఎంపీ మిథున్‌రెడ్డిని కూటమి ప్రభుత్వం వేధిస్తోందన్నారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌తో మిథున్‌రెడ్డికి ఉన్న అనుబంధాన్ని తెంచేందుకే అక్రమ కేసులు బనాయిస్తోందని దుయ్యబట్టారు. వారి బంధాన్ని ఎవ్వరూ తెంచలేరన్నారు. గత సీఎం వైఎస్ జగన్ కంటే అభివృద్ధి, సంక్షేమాన్ని ఎక్కువ చేసి పోటీ పడాల్సింది పోయి, కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు, వేధింపులకు దిగుతోందని విమర్శించారు. "ఏపీ లిక్కర్ స్కాం ఢిల్లీ లిక్కర్ స్కాం కంటే పెద్దదన్నారు. రూ.30 వేల కోట్లు, రూ.10 వేల కోట్లన్నారు. ఇప్పుడేమో రూ.3 వేల కోట్లని చెబుతూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు" అని దుయ్యబట్టారు. పెద్దిరెడ్డి కుటుంబానికి ప్రజల్లో ఉన్న ఆదరణను జీర్ణించుకోలేని సీఎం చంద్రబాబు అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని విమర్శలు గుప్పించారు. ఎన్ని కేసులు పెట్టినా ఎంపీ మిథున్‌రెడ్డి కడిగిన ముత్యంలా బయటకు వస్తారని అన్నారు. త్వరలోనే ఆయన బయటకు వచ్చి, రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సేవ చేస్తారని అన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల మనోధైర్యాన్ని దెబ్బ తీసేందుకు కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఉభయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ సాదిక్ హుస్సేన్ కూడా ఉన్నారు.

తడబడిన అడుగు

- జిల్లాలో నిలిచిపోయిన నాడు-నేడు
- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రెండవ దశలో 763 నిర్మాణాలకు అనుమతి
- రూ.249.25 కోట్ల కేటాయింపు
- గత ప్రభుత్వ హయాంలోనే 644 పనులు ప్రారంభం
- వీటిలో 117 పూర్తి.. రూ.115.51 కోట్ల ఖర్చు
- కూటమి ప్రభుత్వం వచ్చాక దాదాపు నిలిచిపోయిన పనులు
- అసంపూర్తి నిర్మాణాలతో నెరవేరని లక్ష్యం

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

పునాదుల్లోనే..

అంబాజీపేట మండలం కె.పెదపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించ తలపెట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణ పరిస్థితి ఇది. మూడు అదనపు తరగతులను నిర్మించేందుకు రూ.39 లక్షలు మంజూరు చేశారు. కేవలం బేస్‌మెంట్ వరకు నిర్మించి వదిలేశారు. 2022లో మంజూరైన నిధులతో చేపట్టిన ఈ పనులు గత ప్రభుత్వ హయాంలో జరగగా కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి.



కె.పెదపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పునాదుల్లోనే నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణం

సాక్షి, అమలాపురం: ప్రభుత్వ పాఠశాలలకు కార్పొరేట్ స్థాయి వసతుల కల్పించాలనే ఆశయం నీరుగారి పోతోంది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కార్పొరేట్ విద్యాసంస్థలకు మేలు జరిగేలా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనను పక్కన పెట్టిందనే విమర్శలకు నాడు-నేడు ఒక ఉదాహరణ. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వందల కోట్ల రూపాయలతో పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా ఆధునీకరించగా కూటమి ప్రభుత్వం నాడు- నేడును ఆటకెక్కిస్తోంది.

నాడు పాఠశాలలకు మహర్దశ

శిథిలావస్థకు చేరి కనీసం విద్యార్థులు కూర్చుని చదువుకునేందుకు సైతం వీలు లేని పాఠశాలలను నాడు- నేడులో మహర్దశ కల్పించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యను పలు రకాలుగా అభివృద్ధి చేసిన విషయం తెలిసిందే. అమ్మ ఒడి, ప్రతి రోజు ఒక కోడిగుడ్డుతో మెరుగైన నాణ్యతతో కూడిన భోజనం, యూనిఫామ్, బూట్లు, పాఠ్య పుస్తకాలు, ట్యాబ్‌లు, ఇంగ్లిష్ మీడియం ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో విప్లవాత్మక చర్యలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుంది. ఇవన్నీ ఒక ఎత్తు కాగా నాడు-నేడులో పాఠశాలలో మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టింది. తొలి దశలో కోనసీమ జిల్లాలో 451 పాఠశాలలను నాడు-నేడుకు ఎంపిక చేసింది. వీటి అభివృద్ధికి రూ.92 కోట్లు కేటాయించింది. దీనిలో రెండు పాఠశాలలలో పనులు ప్రారంభం కాలేదు. మిగిలిన పాఠశాలలకు సంబంధించి 433 పాఠశాలల్లో పనులు పూర్తికాగా 16 చోట్ల పనులు ఇంకా పూర్తి కాలేదు. కేటాయించిన నిధుల కన్నా అదనంగా రూ.92.12 కోట్లు ఖర్చు చేశారు. ఇక రెండవ దశకు సంబంధించి 763 పాఠశాలలను నాడు -నేడుకు ఎంపిక చేశారు. ఇందుకు రూ.249.29 కోట్లు కేటాయించారు. రెండు పాఠశాలల్లో పనులు మొదలు కాలేదు. 117 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. 644 పాఠశాలల్లో పనులు మొదలై వివిధ దశల్లో ఉన్నాయి. మొత్తం రూ.115.51 కోట్లు ఖర్చు అయ్యింది. ఈ పనుల్లో 90 శాతం గత ప్రభుత్వ హయాంలోనే జరగడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పనులు దాదాపు నిలిచిపోయాయి. జిల్లాలో నాడు- నేడు రెండు దశల్లో కలిపి 1,214 పాఠశాలలు ఎంపిక కాగా ఇప్పటి వరకు 550 పాఠశాలల్లో పనులు పూర్తయ్యాయి. మిగిలిన 660 పాఠశాలల్లో పనులు పూర్తి కాకపోవడానికి కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వెనుక విద్యను మరింత ప్రైవేటీకరించాలని ఆలోచన ఉందనే అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



మలికిపురం మండలం ఇరుసుమండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణం

కొసరు పనులు గాలికి..

మలికిపురం మండలం ఇరుసుమండ జెడ్పీ ఉన్నత పాఠశాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మొత్తం రూ.64 లక్షలు కేటాయించగా రూ.32లక్షల వరకు ఖర్చు చేశారు. మరో రూ.32 లక్షల పనులు జరగాల్సి ఉంది. తరగతి గదులకు సంబంధించి శ్లాబ్‌లు వేశారు, గోడలు కట్టారు. కాని తలుపులు, విద్యుత్ వంటి పనులు జరగలేదు. పనులు నిలిచిపోవడంతో ఈ భవనం నిరుపయోగంగా మారింది.

పనులు ఆగిపోయినట్టే..

ముమ్మిడివరం మండలం గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలకు నాడు- నేడులో పనుల నిమిత్తం రూ.1.06 కోట్లు మంజూరు చేశారు. దీనిలో మూడు అదనపు తరగతి గదులకు సంబంధించి రూ.42 లక్షలు మంజూరు కాగా, ఇప్పటికీ పునాదుల దశ దాటలేదు. పాఠశాల మరమ్మతులు, ఇతర పనులకు కేటాయించిన రూ.24 లక్షల పనులు ఇంకా మొదలు కాలేదు. ఇంకా తరగతి గదులలో ఫ్లోరింగ్, టైల్స్ వేయాల్సి ఉంది. ఆర్వో ప్లాంట్ నిర్మాణంతోపాటు విద్యుత్ మరమ్మతులు వంటి పనులు ఇప్పటికీ పూర్తి కాలేదు.



ముమ్మిడివరం మండలం గాడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిలిచిపోయిన అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు

అన్నీ ఇచ్చారు.. నిర్మాణం పూర్తి కాలేదు

రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో నాడు-నేడులో ఆరు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు రూ.63.98 లక్షలు కేటాయించారు. తొలి దశలో రెండు, రెండవ దశలో రెండు చొప్పున నాలుగు అదనపు తరగతులు గదులకు సంబంధించి శ్లాబ్, ఇతర పనులు చేపట్టారు. విద్యుత్ పరికరాలు ఇచ్చారు. వైరింగ్ చేయలేదు. తలుపులు, కిటికీలు అందించారు. కాని కిటికీలకు గ్రిల్స్ లేవు. రంగులు వేయలేదు. మరో రూ.పది లక్షలు ఇస్తే అన్ని పనులు పూర్తవుతాయి.



రావులపాలెం జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పూర్తి కాని అదనపు తరగతి గదులు

తలుపులు లేవు

ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లి ఎంపీపీఎస్ పాఠశాల అభివృద్ధికి నాడు-నేడు రెండవ దశలో రూ.36 లక్షలు కేటాయించారు. రెండు అదనపు తరగతి గదులతో పాటు ఇతర పనులకు నిధులు కేటాయించారు. ఒక గది నిర్మాణం మాత్రమే జరిగింది. రూ.పది లక్షలు మాత్రమే వచ్చాయి. నిర్మించిన గదికి గుమ్మాలు.. తలుపులు లేవు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలోనే అదనంగా బెంచీలు వచ్చాయి. ఇప్పుడు ప్రభుత్వంలో మాత్రం ఒక్క రూపాయి కూడా రాలేదు.



ఉప్పలగుప్తం మండలం చినగాడవిల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో తలుపులు లేని గుమ్మాలు, కిటికీలు

మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి



మహిళా శిక్షణ సదస్సులో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ జిల్లా పీడీ జయచంద్ర గాంధీ

మలికిపురం: ప్రభుత్వ రుణాలను సద్వినియోగం చేసుకుని గ్రామీణ ప్రాంత మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జయచంద్ర గాంధీ సూచించారు. మంగళవారం మలికిపురం వెలుగు కార్యాలయంలో డీఆర్‌డీఏ, జిల్లా చిన్న తరహా పరిశ్రమల ప్రోత్సాహక అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జరిగిన మహిళల శిక్షణ సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళా సంఘాలకు ఎటువంటి సెక్యూరిటీ లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో బ్యాంకులు, స్త్రీ నిధి బ్యాంకు ద్వారా అనేక రుణాలను ఇస్తూ ప్రోత్సాహం అందిస్తుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళ ఆర్థిక స్వావలంబన సాధిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా నిలబడుతుందన్నారు. రుణాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా ఇది సాధ్యమవుతుందన్నారు. జిల్లా చిన్నతరహా పరిశ్రమల అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆహార ప్రోసెసింగ్ పరిశ్రమలకు సబ్సిడీ అధికంగా ఉంటుందన్నారు. మన ప్రాంతంలో లభించే కొబ్బరి, జీడిపప్పు, పండ్ల తోటల ద్వారా ఆహార ప్రోసెసింగ్ పరిశ్రమలు స్థాపించుకోవాలని సూచించారు. అవసరం తెలిస్తే ఆలోచన వచ్చి ఉపాధికి అవకాశం లభిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పలు స్కీమ్‌ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. సదస్సులో పాల్గొన్న ఇండస్ట్రీస్ జిల్లా ఎండీ పి.శివరామప్రసాద్ మాట్లాడుతూ మహిళలు వివిధ పథకాలను వినియోగించుకునే విధంగా ఉద్యం ఆధార్ ఉచిత రిజిస్ట్రేషన్ మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జెడ్పీటీసీ బల్ల ప్రసన్న కుమారి, ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు దివ్వి దుర్గాభవాని, కమిడి దివ్య, దళం అశ్విని, ఏపీఎం సయీద్ పాల్గొన్నారు.

ఎక్సైజ్ సూపరింటెండెంట్ ప్రసాద్ తిరిగి అమలాపురానికి బదిలీ

అమలాపురం టౌన్: జిల్లాకు కేటాయించిన బార్లకు దరఖాస్తుల స్వీకరణలో జరిగిన అలక్ష్యం పేరుతో గత నెల విజయవాడ ఎక్సైజ్ శాఖకు బదిలీ అయిన జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్‌కేడీవీ ప్రసాద్ తిరిగి ఇదే జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లాకు కేటాయించిన 11 బార్లలో ఒకే ఒక బార్‌కు దరఖాస్తులను స్వీకరించగా మిగిలిన 10 బార్లకు దరఖాస్తులు రాని విషయం విదితమే. గత నెల 29న జరిగిన ఈ దరఖాస్తుల స్వీకరణలో అలక్ష్యం జరిగిందంటూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ ప్రసాద్‌పై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. మళ్లీ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ప్రసాద్ తిరిగి నెల రోజుల్లోపే జిల్లాకు వచ్చారు. అయితే బార్లకు దరఖాస్తుల స్వీకరణలో జరిగిన అలక్ష్యంతో ఇతర అధికారులకు బెదిరింపు, హెచ్చరిక కోసమే ఆయనను బదిలీ చేశారని ఎక్సైజ్ సిబ్బంది చెబుతోంది. ఉత్తుత్తి బదిలీతో ఎక్సైజ్ శాఖ ప్రసాద్‌ను అలా పంపించి ఇలా తిరిగి ఇదే జిల్లాకు అదే పోస్టులో, అదే చోట నియమించిందని జిల్లా శాఖ సిబ్బందిలో చర్చ జరుగుతోంది.

వైఎస్సార్ సీపీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కల్పించాలి

పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి కిషోర్



అమలాపురం టౌన్: అత్యధిక ఓటు శాతం ఉన్న వైఎస్సార్ సీపీకి అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కల్పించి మాట్లాడే సమయాన్ని కేటాయించవచ్చని నిబంధనలు చెబుతున్నాయని పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం అధికార ప్రతినిధి తెన్నేటి కిషోర్ అన్నారు. అమలాపురంలో ఆయన మంగళవారం స్థానిక మీడియాతో మాట్లాడారు. అసెంబ్లీ రూల్స్ అండ్ ప్రొసీజర్స్ పదే పదే చెప్పే స్పీకర్ వాటిని అమలు చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని ఆయన స్పష్టం చేశారు. అధిక ఓటింగ్ శాతం ఉన్న వైఎస్సార్ సీపీకి అసెంబ్లీలో మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడం ప్రశ్నించే గొంతుకను నొక్కేయడమేనని ఆయన ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాలకు ముందు బిజినెస్ కమిటీ, రూల్స్ కమిటీలతో స్పీకర్ ఈ విషయమై చర్చించాల్సి ఉండగా ఏకపక్ష నిర్ణయంతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అసెంబ్లీకి రాకుండా చేయడం సరికాదని పేర్కొన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వం పాలనను పక్కన పెట్టి ఆదాయ మార్గాల అన్వేషణలో ఉందన్నారు. నేడు ప్రభుత్వ వైద్య కళాశాలలను, గ్రానైట్ క్వారీస్‌ను పీపీపీ విధానంలో ప్రైవేటుపరం చేస్తూ ఆదాయ వనరులు పెంచుకుంటోందని విమర్శించారు. పేద కుటుంబాల విద్యార్థులను ప్రభుత్వ వైద్య విద్యకు దూరమయ్యేలా చేసిన పీపీపీ విధానాన్ని కూటమి ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని కిషోర్ డిమాండ్ చేశారు.

108కు 'పచ్చ'కామెర్లు

ఉప్పలగుప్తం: 108 వాహనాలకు 'పచ్చ'రంగు పడింది. సాధారణంగా అంబులెన్స్‌లకు నీలం రంగు, ఎరుపు రంగు రేడియం స్టిక్కర్లు వేస్తారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నీలం రంగు వేసి, ఎరుపు, తెలుపు రేడియం స్టిక్కర్లు వేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 108 వాహనాల ముందు భాగానికి పసుపు రంగు వేసి, వాహనానికి ఇరువైపులా పసుపు రంగు బోర్డులు వేయడం గమనార్హం. వాహనాలకు రంగు మార్చేందుకు విజయవాడ తీసుకుని వెళుతున్నారు. రంగుల మార్చడానికి తోడు వాహనాన్ని విజయవాడ తీసుకుని వెళ్లడం అదనపు ఖర్చు. ఒక అంబులెన్స్ వెళ్లి రంగు మార్చుకొని రావడానికి పది నుంచి పదిహేను రోజులు పడుతోంది. ఈ సమయంలో స్థానికులకు ఎటువంటి ప్రమాదం జరిగినా సకాలంలో 108 అంబులెన్స్‌లు రావడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ పార్టీ రంగులను పోలి ఉంటే చాలు పార్టీ రంగులు వేశారని నానా హంగామా చేసిన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీలు ఇప్పుడు పచ్చరంగు వేయడంపై మాత్రం నోరు మెదపకపోవడం విమర్శలకు దారితీస్తోంది.



పచ్చరంగులో ఉన్న అంబులెన్స్ ముందు భాగం

29 సారా రహిత గ్రామాలు

కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: నవోదయం ద్వారా జిల్లాలో 8 మండలాల్లో 29 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించామని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నవోదయం 2.0 కార్యక్రమాల అమలపై జిల్లా స్థాయిలో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ నవోదయం 2.0 కార్యక్రమాలను పటిష్టంగా అమలు చేస్తూ సారా రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. తొలుత ప్రోహిబిషన్ ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ వి.రేణుక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నవోదయం కార్యక్రమాల ప్రగతిని అధికా రులకు వివరించారు. ఇప్పటివరకు జిల్లాలో ఆలమూరు, పి.గన్నవరం, ఆత్రేయపురం మండలాల్లో సుమారు 29 గ్రామాలను సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దామన్నారు. ప్రత్యామ్నాయ జీవనోపాధుల కోసం మూడు కుటుంబాలను గుర్తించామన్నారు. ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్‌ఓ కే మాధవి, సాంఘిక సంక్షేమ శాఖ సాధికార అధికారి పి. జ్యోతిలక్ష్మీదేవి, డీఆర్‌డీఏ పీడీ జయచంద్ర గాంధీ, జిల్లా అటవీ శాఖ అధికారి ఎంవీ. ప్రసాద్ రావు ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

గురుకుల విద్యార్థికి సాయం

అమలాపురం మండలం జనుపల్లి చెందిన జాన్ పాటి విజయ్ కుమార్ వైద్య ఖర్చులకు సహాయం అందించామని కలెక్టర్ మహేష్ కుమార్ చెప్పారు. అల్లవరం మండలం గోడి అంబేడ్కర్ గురుకుల కళాశాలలో విజయ్‌కుమార్ జూనియర్ ఇంటర్ బైపీసీ చదువుతూ ఈ నెల 19వ తేదీ హాస్టల్ పై భాగంలో ఆరబెట్టిన దుస్తులను తీసుకువచ్చే క్రమంలో కళ్లు తిరిగి మేడ పైనుంచి కిందికి ప్రమాదవ శాత్తు జారిపడ్డాడని తెలిపారు. విజయ్ కుమార్‌కు రూ.50,000 ఇన్సూరెన్స్ రూపంలో వైద్య ఖర్చులు మంజూరు చేశామన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా చికిత్స పొందుతున్నాడన్నారు.

జీజీహెచ్‌లో 2డీ ఎకో సేవలు పునఃప్రారంభం

కాకినాడ క్రైం: స్థానిక జీజీహెచ్‌లో 2డీ ఎకో సేవలు మంగళవారం పునఃప్రారంభమయ్యాయి. ఎన్టీఆర్ వైద్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ వానపల్లి వరప్రసాద్ ఈ విషయం తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్య కుమారి ఆదేశాల మేరకు, ఇన్‌సోర్సింగ్ విధానంలో కార్డియాలజిస్టులను ఆసుపత్రికి తీసుకొచ్చి రోగులకు 2డీ ఎకో సేవలు అందిస్తున్నామని వివరించారు. దీని ద్వారా హృద్రోగాలతో బాధపడుతున్న వారికి తొలి దశ వైద్య సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. తొలి రోజు 30 మందికి 2డీ ఎకో పరీక్షలు నిర్వహించామని తెలిపారు. ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



రోగికి 2డీ ఎకో పరీక్ష నిర్వహిస్తున్న కార్డియాలజిస్టు

సముద్ర నీటి వల్ల కొబ్బరి చెట్లు చనిపోయాయి

కొబ్బరి పరిశోధనా కేంద్ర అధిపతి ముత్యాలనాయుడు

అంబాజీపేట: సముద్ర తీర ప్రాంత మలికిపురం మండలంలోని శంకరగుప్తం కాలువ వెంబడి ఉన్న కొబ్బరి తోటలు సమీపంలో ఉన్న సముద్రపు నీరు వెనకకు ప్రవహించటం వల్ల చనిపోయాయని ఉద్యాన శాస్త్ర వేత్తల బృందం స్పష్టం చేసింది. అంబాజీపేటలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధనా కేంద్ర అధిపతి డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో శంకరగుప్తం ప్రాంతంలో సోమవారం ఉద్యాన శాస్త్రవేత్తల బృందం పర్యటించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. స్థానిక పరిశోధనా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంగళవారం ముత్యాల నాయుడు మాట్లాడుతూ తాము శంకరగుప్తం, కేశనపల్లి, తూర్పుపాలెం పరిసర ప్రాంతాల్లోని కొబ్బరి తోటలను పరిశీలించామన్నారు. సమీపంలో ఉన్న బంగాళాఖాతంలోని ఉప్పునీరు వెనుకకు ప్రవహించడంతో పాటు ,ఉప్పునీరు అక్కడే నిల్వ ఉండిపోయిందన్నారు. కొబ్బరి చెట్లకు లవణ గాఢత ఎక్కువై చనిపోయినట్లు గుర్తించామన్నారు. 2017లో కాలువ తవ్వకాలు అసంపూర్తిగా చేపట్టడం, 29.5 కిలోమీటర్లకు కేవలం 9 కిలోమీటర్లు మాత్రమే తవ్వడంతో నిల్వ నీరు వెళ్లే మార్గం లేకపోయిందన్నారు. భూగర్భ జలాల లవణీయత పెరిగి 2019 నుంచి సుమారు 40 ఎళ్ల కొబ్బరి తోటలు చనిపోయాయన్నారు. పొలాల నుంచి నీటి నమూనాలు సేకరించి వాటి విద్యుత్ వాహకత, పి.హెచ్ ఇతర భౌతిక అంశాలను అధ్యయనం చేశామన్నారు. ఈ సమస్య పరిష్కారానికి శంకరగుప్తం డ్రెయిన్‌ను పూర్తిగా తవ్వడంతో పాటు జీలుగ వంటి పచ్చి రొట్ట ఎరువులు, జిప్సం వేసి కలియదున్నాలని వివరించారు. కొబ్బరి తోటలను పరిశీలించిన శాస్త్రవేత్తల బృందంలో డాక్టర్ డి.వెంకటస్వామి, బి.పెదబాబు, వి.గోవర్ధనరావు, మలికిపురం ఉద్యానాధికారి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆంధ్రా క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా శ్రీనివాస్



అంబాజీపేట: అంబాజీపేటకు చెందిన నిమ్మకాయల ఎస్.ఎస్.ఎస్. శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ రంజీ క్రికెట్ జట్టు ఫీల్డింగ్ కోచ్‌గా మరోసారి ఎంపికయ్యారు. ఈ మేరకు ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ నుంచి ఉత్తర్వులు అందినట్టు శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఆయన ప్రస్తుతం గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అకాడమీ క్రికెట్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. గతంలో రెండుసార్లు ఆయన రంజీ జట్టుకు ఫీల్డింగ్ కోచ్‌గా సేవలందించారు. అంబాజీపేటకు చెందిన శ్రీనివాస్ క్రీడాకారునిగా సైతం రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందారు. 2005లో ఏపీ రంజీ క్రికెట్ జట్టు ప్రోబబుల్స్‌కు ఎంపికయ్యారు. వివిధ రాష్ట్రాల్లో జరిగిన క్రికెట్ పోటీల్లో ఏపీ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. అంబాజీపేటలో నిర్వహించిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ సబ్ సెంటర్ కోచ్‌గా ప్రస్థానం ప్రారంభించిన శ్రీనివాస్ అంచెలంచెలుగా ఎదుగుతున్నారు. 2014 నుంచి 2022 వరకూ కడప జిల్లాలో ఏసీఏ అకాడమీ కోచ్‌గా సేవలందించారు. తరువాత మంగళగిరి, విజయనగరం అకాడమీలలో కూడా పనిచేశారు. ప్రస్తుతం మంగళగిరి అకాడమీ అసిస్టెంట్ కోచ్‌గా రాష్ట్ర అండర్–14 జట్టుకు రెండు సార్లు, అండర్–16 జట్టుకు ఒకసారి కోచ్ వ్యవహరించారు. తనను రంజీ జట్టు కోచ్‌గా ఎంపిక చేయడం పట్ల ఏసీఏ అధ్యక్షుడు కేశినేని చిన్ని, కార్యదర్శి సానా సతీష్, ఏసీఏ ఎఫెక్స్ కౌన్సిల్ సభ్యులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

భర్తపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు



ఘటనా స్థలిలో వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ ప్రసాద్, ఎస్సై జానీ బాషా

కె.గంగవరం: మండల పరిధిలోని కోటిపల్లిలో భార్యపై హత్యాయత్నం చేసిన భర్తపై కె.గంగవరం పోలీసులు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. కె.గంగవరం ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మోహమాటి అశ్విని, రామచంద్రపురం పట్టణానికి చెందిన దత్త వీర వెంకట శివకుమార్ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. ఇటీవల శివకుమార్ మద్యానికి బానిస అయ్యాడు. ఈ నేపథ్యంలో అశ్విని కోటిపల్లిలో అమ్మగారి ఇంటి వద్దనే ఉంటుంది. అయితే ఇదే క్రమంలో సోమవారం రాత్రి శివకుమార్ దళిత కాలనీలో ఉన్న అశ్విని వద్దకు వెళ్లి గొడవ పడ్డాడు. ఆమెను కులం పేరుతో దూషించడంతో పాటు హత్యాయత్నం చేయడానికి ప్రయత్నించాడు. దీనిపై భార్య అశ్విని ఫిర్యాదు చేయగా కె.గంగవరం ఎస్సై జానీ బాషా కేసు నమోదు చేశారు. ఈ కేసుపై రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. శివకుమార్‌ను త్వరలో అరెస్టు చేస్తామని చెప్పారు.

అప్రమత్తతతోనే భద్రత

- తల్లిదండ్రులూ..పిల్లలపై ఓ కన్నేయండి
- సెలవుల్లో వెన్నాడే ప్రమాదాలు



ఈత కొడుతున్న పిల్లలు (ఫైల్)

రాయవరం: పాఠశాలలకు దసరా సెలవులు ఇచ్చేశారు. పిల్లలు పట్టలేని ఆనందంతో ఉన్నారు. సెలవుల సమయంలో ఆటపాటల్లో మునిగి తేలుతుంటారు. ఈ సమయంలో ఒక్కోసారి ఊహించని ప్రమాదాలు జరుగుతుంటాయి. పాఠశాలల్లో నిత్యం ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఉండే విద్యార్థులు సెలవుల్లో తల్లిదండ్రుల సంరక్షణలో ఉంటారు. అయితే ఈ సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలు ఏమి చేస్తున్నారనే విషయాన్ని గమనిస్తుండాలి. కాలువల్లో స్నానాలకు వెళ్లే వారు కొందరైతే మరికొందరు సెల్‌ఫోన్లలో గేమ్స్‌ను చూస్తుంటారు. మరికొందరు సాహసాలు చేస్తుంటారు.

ఈత సరదా తీస్తుంది ప్రాణం

జిల్లాలో గోదావరి తీరం ఒక పక్క, మరో పక్క కాలువలు అధికంగా ఉంటాయి. సెలవుల్లో సరదా కోసం, కాలక్షేపం కోసం కొందరు ఈతకు దిగుతుంటారు. ఆ సమయంలో కాలక్షేపం కోసం వారు చేసే పనులు ఒక్కోసారి ఊహించని ప్రమాదాలకు దారితీస్తుంటాయి. దసరా, సంక్రాంతి సెలవుల్లో పిల్లలకు అధిక సమయం దొరుకుతుంది. ఆ సమయంలోనే వారు ప్రమాదాలకు గురవుతుంటారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో పిల్లల సంరక్షణపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు నదులు, కాలువలు, చెరువుల్లో నీరు నిండుగా ఉంది. సాధారణంగా నీరు కనిపిస్తే పిల్లలకు ఈత కొట్టాలనిపిస్తుంది. గ్రామీణ ప్రాంత పిల్లలకు ఎక్కువగా ఈత వస్తుంది. చిన్నప్పటి నుంచి పట్టణాలు, హాస్టళ్లలో ఉండే పిల్లలకు ఈత పెద్దగా తెలియదు. అటువంటి వారు గ్రామాలకు వచ్చి తోటి పిల్లలతో సరదాగా ఈతకు వెళ్తుంటారు. ఆ సమయంలో ఈత రాక ప్రమాదాలకు గురవుతుంటారు. అటు వంటి వారి విషయంలో తల్లిదండ్రులు ఒక కన్నేసి ఉంచాలి. చెరువులు, కాలువల వైపుగా వెళ్లి నప్పుడు.. పెద్దవారిని తోడుగా తీసుకొని వెళ్లాలని వివరించాలి.

మితి మీరిన వేగంతో ప్రమాదం

కొందరు పిల్లలు తల్లిదండ్రులకు చెప్పకుండా ఇంట్లో ఉన్న వాహనాలను తీసుకొని రోడ్లపైకి వచ్చేస్తుంటారు. మితిమీరిన వేగానికి తోడు రహదారి భద్రతా చర్యలు పాటించడం లేదు. ఈ క్రమంలో కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి.. ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నింపుతున్నాయి. పిల్లలకు మోటార్ సైకిల్ ఇస్తే తల్లిదండ్రులకు కూడా శిక్షలు పడతాయన్న విషయాన్ని విస్మరించకూడదు. చిన్నారుల చేతికి వాహనాలు ఇవ్వకపోవడమే శ్రేయస్కరం.

సహవాస దోషాలతో ప్రమాదాలు

సహవాస దోషంతో వారు వీరవుతారు..వీరు వారవుతారనేది సామెత. మనం చేసే స్నేహాలను బట్టే మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నది కూడా వాస్తవం. ఇటీవల కాలంలో జిల్లాలో మైనర్లు, విద్యార్థులు మత్తు బారిన పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. స్నేహితుల్లో ఎవరికో ఒకరికి సిగరెట్లు, గంజాయి వంటి అలవాటు ఉంటే మిగతావారు చెడు ప్రభావాలకు లోనవుతుంటారు. సరదాగా ఒకసారి మొదలైన అలవాటు, వ్యసనానికి దారి తీస్తుంది. అందుకే సెలవుల్లో పిల్లల విషయంలో తల్లిదండ్రులు చాలా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఆన్‌లైన్ గేమ్స్‌తో జాగ్రత్తగా ఉండాలి

ఆన్‌లైన్ తరగతులు, అదనపు పరిజ్ఞానం కోసం చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్స్ ఇస్తుంటారు. ఇటువంటి సందర్భాల్లో ప్రయోజనం ఎంత ఉంటుందో చెప్పలేము కాని, అనర్థాలే అధికంగా ఉంటాయి. ఒక్కోసారి అవసరమైన యాప్స్ నుంచి అనవసరమైన, ప్రమాదకరమైన యాప్స్‌లోకి వెళ్లిపోతుంటారు. తల్లిదండ్రులు దగ్గర ఉండి గమనించకుంటే పిల్లలు చెడుదారి పట్టే ప్రమాదం ఉంటుంది. అలాగే సోషల్ మీడియా అకౌంట్లు తెరిస్తే పిల్లలు పక్కదారి పట్టే ప్రమాదం కూడా లేకపోలేదు.

కంట కనిపెట్టాలి



దసరా సెలవుల్లో విద్యార్థులను కంట కనిపెట్టాలి. సృజనాత్మకత, నైతికత విలువలు పెంచేందుకు కథల పుస్తకాలు చదివించాలి. దీనివల్ల పుస్తక పఠనం పెరుగుతుంది. సెల్‌ఫోన్స్‌కు పిల్లలను దూరంగా ఉంచే విధంగా చూడాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, డీఈవో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

సోషల్ మీడియాతో ప్రమాదం



పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచాలి. తల్లిదండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. సోషల్ మీడియా, ఆన్‌లైన్ గేమ్స్‌తో పిల్లలు అనుకోని ప్రమాదాల్లో చిక్కుకుంటారు.

– బి.రఘువీర్, డీఎస్పీ, రామచంద్రపురం

బార్ తొలగించాలని ఆందోళన



బార్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

నిడదవోలు : పట్టణంలో సుబ్బరాజుపేటలో ఏర్పాటు చేసిన చైతన్య బార్ – రెస్టారెంట్ తొలగించాలని స్థానికులు మంగళవారం బార్ వద్ద ఆందోళన చేశారు. దళితులు, శ్రామికుల కుటుంబాలను దోచుకోవటానికే ప్రశాంతంగా ఉండే ఈ ప్రాంతంలో మద్యం బార్లు తెరుస్తున్నారని ఆందోళనకారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బైపే రాజేశ్వరరావు, సీపీఎం నాయకులు జువ్వల రాంబాబు, టి.ప్రేమ్‌కుమార్ ఎం. భాను, బి.నాని, నక్కా సురేష్, గుమ్మడి రాజు, ఎం.డేవిడ్ వి. పవన్ కుమార్, వి. కళ్యాణ్, జాన్, పుల్లారావు పాల్గొన్నారు.

ఆగని మరణ మృదంగం



మృతి చెందిన గేదెను జేసీబీ సాయంతో తరలిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో అంతుచిక్కని వ్యాధితో పాడి గేదెలు మృత్యువాత పడుతూనే ఉన్నాయి. దీంతో పాడి రైతులు విలపిస్తున్నారు. గ్రామానికి చెందిన గెడ్డం మణికంఠకు చెందిన పాడి గేదె కొద్ది రోజులుగా వ్యాధిబారిన పడి మంగళవారం మృతి చెందింది. మందులు వాడినా, వ్యాక్సిన్లు వేసినా ప్రయోజనం లేదని అతను ఆవేదన వ్యక్తం చేశారు. రెండు రోజుల క్రితం జమ్ముల శ్రీనుకు చెందిన పాడి గేదె కూడా మృతి చెందింది. మృతి చెందిన గేదెలను బయటకు తరలించడానికి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోందని రైతులు చెబుతున్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 23 మంది రైతులకు చెందిన 33 గేదెలు అంతు చిక్కని వ్యాధి బారిన పడి మృత్యువాత పడ్డాయని రైతులు చెబుతున్నారు.

కరుడు గట్టిన నేరస్తుడి కోసం ముమ్మర గాలింపు

- 15 ప్రత్యేక బృందాల ఏర్పాటు
- 70 కేసుల్లో ప్రభాకర్ ముద్దాయి
- నాలుగు రాష్ట్రాల్లో కేసులు
- ఇద్దరు ఎస్కార్ట్ కానిస్టేబుళ్ల సస్పెన్షన్
- డీఎస్పీ దేవకుమార్ వెల్లడి



పోలీసుల కళ్లుకప్పి పరారైన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ (ఫైల్)

దేవరపల్లి: పోలీసుల కళ్లు కప్పి సోమవారం రాత్రి పారిపోయిన కరుడు గట్టిన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. వివిధ కేసుల్లో ముద్దాయిగా ఉండి రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఖైదీగా ఉన్న ప్రభాకర్ తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద చేతులకు బేడీలతో పరారైన సంఘటన పాఠకులకు తెలిసిందే. విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డారు. ఏలూరు డీఐజీ అశోక్ కుమార్, జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ సీఐ నాగేశ్వరనాయక్ హుటాహుటీన ఘటనా స్థలానికి చేరుకుని నేరస్తుడి కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 50 మంది యువకులతో బైక్‌లపై పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోయింది. అర్ధరాత్రి వరకు యువకులు, పోలీసులు పొలాల్లో గాలించారు.



దుద్దుకూరు వద్ద ఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న ఎస్పీ నరసింహ కిషోర్



దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

15 ప్రత్యేక బృందాల ఏర్పాటు

పోలీసుల కళ్లుకప్పి పరారైన నేరస్తుడు బత్తుల ప్రభాకర్ కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. మంగళవారం దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. 15 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముద్దాయి కోసం గాలిస్తున్నట్టు ఆయన చెప్పారు. నేరస్థుడు ప్రభాకర్‌పై ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళలో సుమారు 80 కేసులు నమోదైనట్టు తెలిపారు. 2011 నుంచి ప్రభాకర్ నేరాలకు పాల్పడుతూ పట్టుబడినట్టు ఆయన చెప్పారు. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి, ఉండ్రాజవరం పోలీస్ స్టేషన్లలో దొంతనం కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్టు ఆయన చెప్పారు. 2022లో హైదరాబాద్‌లోని గచ్‌బౌలిలోని పబ్‌లో ఉన్న అతనిని పట్టుకోవడానికి వెళ్లిన పోలీసులపై ప్రభాకర్ కాల్పులు జరిపినట్టు ఆయన చెప్పారు. ఫీజులు కట్టే సమయంలో విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు, గృహాలను లక్ష్యంగా పెట్టుకుని ఒంటరిగా దొంగతనాలు చేస్తాడని తెలిపారు. ఉండ్రాజవరం మండలం వేలివెన్ను కాలేజీలో రూ.30 లక్షలు, దేవరపల్లి మండలంలో రోమన్ కేథలిక్స్ స్కూల్లో రూ.3 లక్షలు చోరీ చేసినట్టు ఆయన తెలిపారు. 10 మంది సీఐలు, 15 మంది ఎస్సైలు, 40 మంది పోలీసులతో రాత్రంతా పొలాల్లో గాలించడంతో పాటు ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహన తనిఖీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. మంగళవారం ఉదయం డాగ్ స్క్వాడ్‌తో గాలించినట్టు ఆయన తెలిపారు. కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని గాలిస్తున్నట్టు ఆయన చెప్పారు. పీటీ వారెంట్లపై రాష్ట్రంలో ఎక్కడైతే కేసులు ఉన్నాయో అక్కడకు తీసుకు వెళుతున్నట్టు చెప్పారు. పారిపోయిన సమయంలో చేతికి హ్యాండ్ కఫ్స్, వైట్ కలర్ టీ షర్టు, బ్లాక్ కలర్ ట్రాక్ ప్యాంటు ధరించి ఉన్నట్టు తెలిపారు. ఎక్కడెక్కడ నేరాలు చేస్తున్నాడు, సన్నిహితుల ఆచూకీని తెలుసుకుంటున్నట్టు ఆయన చెప్పారు. ముద్దాయి ఆచూకీ తెలిపిన వారికి రూ.50 వేల పారితోషికం ఇవ్వనున్నట్టు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు దేవరపల్లి పోలీసుల మొబైల్ నెంబర్లు 94407 96584 (సీఐ), 9440796624 (ఎస్సై)కు సమాచారం ఇవ్వాలని కోరారు.

అనేక కేసుల్లో నిందితుడు

చిత్తూరు జిల్లాకు చెందిన బత్తుల ప్రభాకర్ కరుడుగట్టిన నేరస్తుడని పోలీసులు చెబుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో ప్రభాకర్‌పై అనేక కేసులు ఉన్నాయి. పలు కేసుల్లో రిమాండ్ ఖైదీగా రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉంటున్నాడు. సోమవారం ఉదయం ఒక కేసులో పోలీసులు విజయవాడ కోర్టుకు తీసుకు వెళ్లి తిరిగి వస్తుండగా దేవరపల్లి మండలం దుద్దుకూరు వద్ద హైవేపై గల హోటల్ వద్ద ఆగారు. ఆ సమయంలో ప్రభాకర్ టీ తాగడానికి చేతులకు ఉన్న హ్యాండ్స్ కప్స్‌ను ఒక చేతిది తీసి మరొక చేతికి ఉంచారు. టీ తాగుతున్న క్రమంలో బత్తుల ప్రభాకర్ ఎస్కార్ట్ పోలీసుల కళ్లు కప్పి హోటల్ వెనుక నుంచి పొలాల్లోకి పరారయ్యాడు. ఎస్కార్ట్ పోలీసులు వెంటపడినప్పటికీ దొరకలేదని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. ప్రభాకర్‌కు ఇద్దరు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లు ఎస్కార్ట్‌గా వెళ్లారు. వీరిద్దరిని విజయవాడ నగర పోలీస్ కమిషనర్ సస్పెండ్ చేశారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతిచెందిన గుర్తుతెలియని వ్యక్తి

కడియం: స్థానిక రైల్వేస్టేషన్ దగ్గర మంగళవారం తెల్లవారుజామున 30 నుంచి 35 సంవత్సరాల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడని రాజమండ్రి జీఆర్‌పీ సిబ్బంది తెలిపారు. అతనిపై ముదురు ఆకుపచ్చ రంగు టీషర్ట్, తెలుపుపచ్చ గళ్ల తువ్వాలు ఉందని తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు రాజమండ్రి రైల్వే పోలీస్‌స్టేషన్ 0883–2442821, 99597 63463, 94407 79249 ఫోన్ నంబర్లకు తెలపాలని జీఆర్‌పీ సిబ్బంది కోరారు.

తప్పు చేసిన జయశాంతిని తప్పించారు

- డీఎస్సీ అభ్యర్థి ఉద్యోగం రద్దు
- తప్పుడు ధ్రువపత్రంతో ఉద్యోగం పొందిన ఫలితం
- రంగంపేట పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ నిర్వాకం
- విద్యాశాఖ విచారణ, రద్దుకు నిర్ణయం
- గతంలోనూ పలు ఆరోపణలు, ఇప్పటికే కొనసాగుతున్న డీఎస్పీ దర్యాప్తు
- తాజా నిర్వాకంతో మరోసారి విచారణకు పోలీస్ శాఖ చర్యలు

కాకినాడ క్రైం: డీఎస్సీ తాజా నియామకాల్లో ఉద్యోగానికి ఎంపికైన ఓ అభ్యర్థి తప్పుడు ధ్రువపత్రం బాగోతం బట్టబయలు అవ్వడంతో ఆమె ఎంపికను జిల్లా విద్యాశాఖ రద్దు చేసింది. వివరాల్లోకి వెళితే కాకినాడ రమణయ్యపేటకు చెందిన ఆముదాల జయశాంతి రంగంపేట పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తోంది. ఆమె భర్త ముమ్మిడి తాతారావు కూడా నాగార్జునసాగర్‌లో ఎస్‌పీఎఫ్ విభాగంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరి ఆదాయం ఏడాదికి సుమారు రూ.13 లక్షలు పైమాటే. అయితే భర్త ఉన్నాడని, అతడిది ప్రభుత్వ ఉద్యోగమని ఎక్కడా ప్రస్తావించకుండా జయశాంతి తన పేరున తండ్రి ఆముదాల రమణ సంరక్షకుడిగా ఈడబ్ల్యూఎస్(ఎకనామికల్లీ వీకర్ సెక్షన్) సర్టిఫికెట్ సృష్టించింది. దరఖాస్తు సమయంలో భర్త పేరు, ఉద్యోగం, ఆయన ఆదాయాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ ప్రయోజనం పొందాలంటే అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల లోపు మాత్రమే ఉండాలి. అయితే, వీరి కుటుంబ వార్షిక ఆదాయం సుమారు రూ.13 లక్షలు కావడంతో ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ పొందేందుకు అభ్యర్థికి అసలు అర్హతే లేదు. తప్పుడు ధ్రువపత్రం సృష్టించడమే కాక దాని ద్వారా ఏకంగా ఉద్యోగం కూడా సంపాదించేయడం అధికారులనే విస్మయానికి గురిచేసింది. ఎంపిక జాబితాలో ఆమె పేరు కింది స్థానాల్లో ఉన్న మిగిలిన అభ్యర్థుల ద్వారా ఈ విషయం బట్టబయలైంది. తక్షణమే స్పందించిన కాకినాడ జిల్లా విద్యాశాఖ అధికారులు జయశాంతి వివరణ తీసుకున్నారు. ఆమె నిర్వాకాన్ని రంగంపేట ఎస్‌హెచ్‌వో దృష్టికి చేర్చి ఆయన నుంచి వివరణ సేకరించారు. అలాగే జయశాంతి భర్త కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న విషయాన్ని ఆయన ఉన్నతాధికారుల ద్వారా నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో ఆమె ఎంపికను రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. శాఖను బురిడీ కొట్టించడంతో పాటు, అర్హత ఉన్న మరో అభ్యర్థి ఉద్యోగాన్ని పొందకుండా చేసిందని ప్రస్తావిస్తూ జయశాంతి నిర్వాకాన్ని జిల్లా ఎస్పీకి తెలియజేసి శాఖాపరమైన చర్యల కోసం విద్యాశాఖ అధికారులు సిఫారసు చేశారు. కొద్ది నెలల క్రితం నకిలీ ఎస్‌ఐ ఐడీని తయారు చేయించి డీఐజీ సంతకాన్నే ఫోర్జరీ చేసి దౌర్జన్యాలకు పాల్పడ్డాడనే నేరంలో సస్పెన్షన్‌కు గురైన కామేశ్వరరావు అనే హెడ్ కానిస్టేబుల్‌కు సహకరించిందనే ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికే జయశాంతిపై డీఎస్పీ భవ్య విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో నేరం తెరమీదికి రావడంతో జిల్లా పోలీస్ శాఖ అప్రమత్తమైంది. జయశాంతిపై అంతర్గత విచారణకు సిద్ధమయింది.

సాధనతో దైవ బలం

శ్రీ పీఠంలో రెండో ప్రసంగంలో పరిపూర్ణానంద స్వామి



కాకినాడ రూరల్‌లో పీఠంలో కుంకుమ పూజ నిర్వహిస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: సాధనతోనే దైవబలం లభిస్తుందని, ప్రతి ఒక్కరూ దైవ బలంతోనే అమ్మ అనుగ్రహం పొందుతారని పరిపూర్ణానంద స్వామి అభిభాషించారు. మహాశక్తి యాగం కార్యక్రమంగా రమణయ్యపేటలోని శ్రీ పీఠంలో రెండో రోజు మంగళవారం వేలాది మంది మహిళలు దీక్షా వస్త్రాలను ధరించి రూ.వంద కోట్ల కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం అర్గల స్తోత్ర ఐశ్వర్యాంబిక హోమం, సాయంత్రం లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఐశ్వర్యాంబిక అమ్మవారు రెండో శ్రీ హరిద్రా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహాశక్తి యాగం కుంకుమార్చనలలో భాగంగా మూడు సార్లు లలితా సహస్ర నామార్చనలను పరిపూర్ణనంద స్వామి భక్తులతో పఠింపజేసి కుంకుమార్చన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక బీజం(విత్తనం) మొలకెత్తాలంటే ఐదు కారణాలు ఉంటాయని వాటిలో ఐదవది దైవమన్నారు. మొట్ట మొదటిది భూమి గర్భంలో ఉన్న జలధారలని, రెండవది సారవంతమైన భూమి, 3వ కారణం విత్తనంలోని శక్తి అని, 4వ కారణం నైసర్గిక సహకారం అన్నారు. ఇవన్నీ ఉన్నా దైవ అనుగ్రహం ఉండాలన్నారు. మనిషి అమ్మవారిని తమలో శక్తిగా నిలుపుకోగలిగే అంత సాధన పొందాలన్నారు. మనం మూలాలను తెలుసుకోగలిగితేనే ముందుకు వెళ్లగలుగుతామన్నారు. ఇందుకోసం చాలా వాటిని త్యాగించాలన్నారు. నీ సంతానంగా భావించి నన్ను నడిపించు అని అమ్మవారిని వేడుకోవాలన్నారు. నవరాత్రుల్లో తొలి రోజు ఐశ్వర్యాంబిక అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా చూసుకున్నామని, అమ్మవారికి అర్చన చేసిన లక్ష అంకురాలను అన్న ప్రసాదంలో వినియోగించామన్నారు.



శ్రీపీఠంలో లలితా అమ్మవారికి హారతి ఇస్తున్న పరిపూర్ణానందస్వామి

రోగి నుంచి వివరాల సేకరణ



ఉప్పలపాడులో దుర్గారావు నుంచి వివరాలు తెలుసుకుంటున్న వైద్య సిబ్బంది

సాక్షి ఇంపాక్ట్

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడుకు చెందిన గరగ నాగ ఆంజనేయ దుర్గారావును వైద్య, ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది కలిసి అతనికి ఉన్న అనారోగ్యంపై వివరాలు తెలుసుకున్నారు. ‘సాక్షి’లో మంగళవారం ప్రచురించిన ‘సాయమందించి ప్రాణభిక్ష పెట్టండి’ కథనానికి స్పందించారు. గండేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేవీ నరేష్, సీహెచ్‌ఓ శర్మ, ఎన్టీఆర్ వైద్యసేవ సిబ్బంది నాగేశ్వరరావు, ఏఎన్‌ఎం రామలక్ష్మి, ఆశ లక్ష్మి మంగళవారం దుర్గారావు ఇంటికి వెళ్లి వ్యాధి వివరాలు అడిగి తెలుసుకుని ఇందుకు సంబంధించి గుంటూరు జీజీహెచ్, విశాఖ కేజీహెచ్‌లో వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని వివరించి తగు సూచనలు, సలహాలు అందజేశారు.

ప్రాణం తీసిన అతివేగం

- పెదవలసలలో ఎదురెదురుగా బైక్‌లు ఢీ
- ఇద్దరు యువకుల మృతి–మరొకరికి తీవ్ర గాయాలు
- సావిత్రినగర్‌లో విషాదం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన లక్ష్మీ సతీష్



కాసురాజు మృతదేహం

తాళ్లరేవు: అతివేగం ఇద్దరు యువకుల ప్రాణాలను బలి తీసుకోగా, మూడు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. మండల పరిధిలోని గాడిమొగ పంచాయతీ పెదవలసల గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందగా, మరొక యువకునికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్‌ఐ పి.సత్యనారాయణ, స్థానికులు తెలిపిన వివరాల మేరకు కేంద్రపాలిత ప్రాంతమైన యానాం సావిత్రినగర్‌కు చెందిన మచ్చా లక్ష్మీ సతీష్ (20), పాలెపు కాసురాజు (21)లు స్పోర్ట్స్ బైక్‌లపై అతివేగంగా వచ్చి ఎదురెదురుగా ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో లక్ష్మీ సతీష్, కాసురాజు అక్కడికక్కడే మృతిచెందారు. బైక్‌పై వెనుక కూర్చున్న సావిత్రినగర్ గ్రామానికి చెందిన మరొక యువకుడు ఇళ్లంగి మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మణికంఠను తాళ్లరేవు సామాజిక ఆస్పత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కోరంగి పోలీసులు అక్కడకు చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. అతివేగం కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఇలా ఉండగా రోడ్డుపై అకస్మాత్తుగా పెద్ద శబ్దం వచ్చిందని వచ్చి చూడగా ఘటనా స్థలంలో యువకులు మృతి చెంది ఉన్నారని స్థానికులు తెలిపారు.

కుటుంబ సభ్యుల రోదన

పెదవలసల గ్రామంలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన ఇద్దరు యువకులతోపాటు తీవ్రంగా గాయపడ్డ యువకుడు కూడా యానాం సావిత్రినగర్ గ్రామానికి చెందినవాడు కావడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాద విషయం తెలుసుకున్న గ్రామస్తులు అధిక సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం హృదయ విదారకంగా మారింది.

పరిశ్రమల కాలుష్యంపై ఆగ్రహం



ఉప్పాడ బీచ్‌రోడ్డులో కుటుంబ సభ్యులతో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు



కాలుష్య పరిశ్రమలకు వ్యతిరేకంగా ప్లకార్డులతో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకార మహిళలు

న్యాయం చేయాలంటూ రోడ్డెక్కిన మత్స్యకారులు

కొత్తపల్లి: తీర ప్రాంతంలో నిర్మించిన కాలుష్య పరిశ్రమలతో సముద్ర జలాలు కలుషితమై మత్స్య సంపద లభించక జీవనోపాధి కోల్పోయామని మత్స్యకారులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రోడ్డెక్కి ఆందోళన చేపట్టారు. మత్స్యకారుల సమస్యలపై ఉప్పాడ బీచ్‌రోడ్డు సెంటర్‌లో మంగళవారం అమీనాబాదు, ఉప్పాడ గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. మత్స్యకారులకు మద్దతుగా వ్యాపారులు దుకాణాలు మూసివేశారు. బీచ్‌రోడ్డు వైపు వెళ్ళే అన్ని రోడ్లను మూసివేశారు. పరిశ్రమలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పరిశ్రమలు విడుదల చేసే కలుషిత వ్యర్థాల వల్ల సుమారు 20 కిలోమీటర్ల మేర సముద్ర జలాలు కలుషితం అవుతున్నాయని, దీంతో మత్స్యసంపద అంతరించిపోతోందని చెప్పారు. ఆరు నెలలుగా మత్స్య సంపద లభించక జీవనోపాధి కోల్పోయామని, ఓఎన్‌జీసీ, రిలయన్స్ పరిశ్రమలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లో గాడిమొగతో పాటు పరిసర గ్రామాల్లో ఏ విధంగా పరిహారం ఇస్తున్నారో ఆ విధంగానే అందించాలని కోరారు. పరిశ్రమల్లో మత్స్యకారులకు జీవనోపాధి కల్పించాలని, బోట్లుకు ఇచ్చే ఆయిల్ సబ్సిడీ పెంచాలని అమీనాబాదులో నిర్మించిన హార్బరులో మార్పులు చేయాలి, నిర్మించిన వాలు వలన దెబ్బతిన్న బోట్లు, వలలకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఉప్పాడ, కోనపాపపేట తీరప్రాంత గ్రామాల్లో రాతి గోడను నిర్మించడంతో పాటు తమ సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మత్స్యకారులతో చర్చించిన అధికారులు

ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్డీఓ మల్లిబాబు, తహసీల్దారు చిన్నారావు చర్చించారు. అయినా వారు ఆందోళన విరమించేలేదు. దీంతో కలెక్టర్ షన్మోహన్ సగిలి స్థానిక తహసీల్దారు కార్యాలయంలో మత్స్యకారులతో చర్చించేందుకు ప్రయత్నించగా వారు నిరాకరించారు.

కోనపాపపేటలో సంఘీభావం

ఉప్పాడలో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులకు సంఘీభావంగా కోనపాపపేటలోని మత్స్యకారులు ఆందోళన నిర్వహించారు. బీచ్ రోడ్డులో రాకపోకలు పూర్తిగా నిలిపివేశారు.